సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 17 । మార్చి । 2023

22న కవి సమ్మేళనం

ఆసిఫాబాద్: షిర్డీ సాయి మందిరంలో ఉగాది సందర్భంగా ఆకసం ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కృష్ణమాచారి, కార్యదర్శి రాధాకృష్ణాచారి తెలిపారు. స్వతంత్రంగా రాసిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. కవిత 20 లైన్లకు మించరాదని, పద్యాలు 4 లైన్లు మాత్రమే ఉండాలన్నారు. కవితలను ఈ నెల 20 సాయంత్రం 5 గంటలలోగా 9381795140, 9441139106 నంబర్లకు వాట్సాప్ చేయాలన్నారు.



పొట్టదశలో జాగ్రత్తలు పాటించాలి

వరి పంటలో పొట్టదశ చాలా కీలకమైనది. రైతులు జాగ్రత్తలు పాటించకుంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని చెన్నూర్ ఏవో కవిత చెబుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.6 /20.1

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

క్రీడాపాఠశాలలో ప్రవేశానికి 20న ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల ఆదర్శ క్రీడాపాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 20న చివరి దశ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీటీడీవో మణెమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతూ తొమ్మిదేళ్ల లోపు వయస్సు ఉన్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్ కార్డుతోపాటు టీషర్ట్, నిక్కర్, షూస్‌తో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా క్రీడాధికారి మధుసూదన్ 95731 05057 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్‌ఐ ధర్నా

ఆసిఫాబాద్: టీఎస్‌పీఎస్సీ బోర్డు కమిటీని రద్దు చేసి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని గురువారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం యువత రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకుని పరీక్షలు రాస్తే, పేపర్లు లీకు కావడం వారి పాలిట శాపంగా మారిందన్నారు. పేపర్ లీక్ చేసిన వారితోపాటు బోర్డు చైర్మన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గం రాజ్‌కుమార్, గేడం టీకానంద్, చాపటి పురుషోత్తం, దుర్గం నిఖిల్, జాడి తిరుపతి, రాజేశ్వర్, సీఐటీయూ నాయకులు అల్లూరి లోకేశ్ పాల్గొన్నారు.

యూడైస్ నమోదు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలల అభివృద్ధికి ఎంతో ముఖ్యమైన యూడైస్ నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం యూడైస్ నమోదుపై వర్క్‌షాప్ నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ యూడైస్‌లో వారం లోగా నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి రాథోడ్ సుభాశ్, ఏఎస్‌సీ అబిద్ అలీ ఉన్నారు.

జోరుగా ఇసుక దందా



జిల్లా కేంద్రంలోని పెద్దవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

- యథేచ్ఛగా వాగులు, ఒర్రెల నుంచి తరలింపు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- జరిమానాలతోనే సరిపెడుతున్న మైనం

ఆసిఫాబాద్: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లోని వాగులు, ఒర్రెల నుంచి నిత్యం ఇసుకను వందల కొద్ది వాహనాల్లో తరలిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇష్టానుసారంగా తోడేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అప్పుడప్పుడు తనిఖీల్లో వాహనాలను పట్టుకుంటున్న అధికారులు నామమాత్రంగా జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఇసుక వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రం నుంచి ఇసుకను హైదరాబాద్, కరీంనగర్ వంటి నగరాలతోపాటు ఆదిలాబాద్, జైనూర్, ఉట్నూర్, వాంకిడి, నిర్మల్, మహారాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు లారీల్లో తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంతో అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అధికారులు కేవలం డ్రైవర్లపై కేసు నమోదు చేయడానికే పరిమితమవుతున్నారు.

సెలవు దినాలను ఎంచుకుని..

కొంత మంది ఇసుక వ్యాపారులు సెలవు దినాలను ఇసుక అక్రమ రవాణాకు ఎంచుకుంటున్నారు. సాధారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుక రవాణాకు అనుమతి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో ఈ దందా కొనసాగిస్తున్నారు. వాంకిడి మండల కేంద్రంలోని చికిలివాగు నుంచి రాత్రి వేళల్లో ఏకంగా జేసీబీలతోనే అక్రమంగా ఇసుక తోడేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొంత మంది అధికారికంగా ఒకే చలాన్‌పై పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లను తరలిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద కొత్తగా నిర్మించిన చెక్‌డ్యాం ఇసుక మాఫియాకు వరంగా మారింది. చెక్‌డ్యాం నిర్మాణంతో పెద్దవాగు వద్ద పెద్దఎత్తున ఇసుక మేటలు వేసింది. కొన్ని నెలలుగా ఇక్కడి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

జరిమానాలకే పరిమితం

ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే వాహనానికి రూ.5 వేల జరిమానా విధిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమార్కులు జరిమానా చెల్లించి దందాను యథావిధిగా కొనసాగిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు అడపాదడపా ట్రాక్టర్లను పట్టుకోవడం తప్ప పూర్తిస్థాయిలో ఇసుక దందాను అదుపు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖ అధికారి నాగరాజును సంప్రదించగా.. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్‌తో కలిసి తనిఖీలు చేపడతామని వెల్లడించారు.

ఆసిఫాబాద్ కేంద్రంగా..

ఇసుక అక్రమ రవాణాకు ఆసిఫాబాద్ ప్రధాన కేంద్రంగా మారింది. ఆసిఫాబాద్ మండలంలోని చిన్నరాజురా, గుండి, బుజల్‌ఘాట్, తుంపెల్లి, బాబాపూర్, భీంపూర్, రెబ్బెన మండలం గంగాపూర్, కొండపల్లి, వాంకిడి మండల కేంద్రంలోని చికిలివాగు, కాగజ్‌నగర్ డివిజన్‌లోని వంజరి, రాస్పెల్లి, దహెగాం, కొంచవెల్లి, ఎర్రవాగు, బీబ్రా, కోత్మీర్, పెంచికల్‌పేట్, బెజ్జూర్ మండలాల్లోని వాగుల నుంచి భారీగా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రివేళల్లో వాగుల నుంచి జేసీబీలు వినియోగించి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నింపుతున్నారు. ఇలా తోడిన ఇసుకను గ్రామాల సమీపాల్లో డంపులుగా ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం లారీల్లో నింపి హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, జైనూర్, నిర్మల్‌తోపాటు మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ నుంచి ఒక్కో లారీకి రూ.60 వేల నుంచి రూ.90 వేల వరకు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు, కాగజ్‌నగర్‌లో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2,500 వరకు తీసుకుంటున్నారు. మండల కేంద్రాల్లోనూ ఇసుకకు భారీగా డిమాండ్ ఉంది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1000 నుంచి రూ.1,500 వరకు ఇసుక నాణ్యతను బట్టి వసూలు చేస్తున్నారు.



పెద్దవాగులో పట్టపగలు ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

కాంగ్రెస్ పీపుల్ మార్చ్



సీఎల్పీ నేత భట్టి విక్రమార్క వెంట నడుస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ రాథ్రే, వి.హనుమంతరావు తదితరులు

- హాథ్‌సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా భట్టి పాదయాత్ర షురూ..
- పిప్రి నుంచి ఇచ్చోడ వరకూ..
- కదిలివచ్చిన ఉమ్మడి జిల్లా శ్రేణులు
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

సాక్షి, ఆదిలాబాద్/ఇచ్చోడ: సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క తలపెట్టిన భారీ పాదయాత్ర గురువారం ఆదిలాబాద్ జిల్లా నుంచి అట్టహాసంగా ప్రారంభమైంది. 'హాత్ సే హాత్ జోడో అభియాన్' కొనసాగింపులో భాగంగా 'పీపుల్స్ మార్చ్' పేరిట పాదయాత్ర ప్రారంభించారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి నుంచి యాత్ర మొదలైంది. సాయంత్రం 6గంటలకు ఇక్కడికి చేరుకున్న ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పోరాట యోధుడు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ముఖ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో భట్టి పాదయాత్ర ప్రారంభించారు. ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావిద్, రోహిత్ చౌదరి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్ హన్మంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొన్నారు. పిప్రి నుంచి ఇచ్చోడ వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల పాదయాత్ర కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున శ్రేణులు కదిలివచ్చారు. ఇచ్చోడలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య నేతలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలు కూడా ప్రసంగించారు. ప్రజాగాయకుడు గద్దర్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం భారీ జనసందోహాన్ని ఉద్దేశించి భట్టి విక్రమార్క ప్రసంగించారు.

ఆలస్యంగా ప్రారంభం..

భట్టి విక్రమార్క పాదయాత్ర సాయంత్రం 4గంటలకు మొదలవుతుందని ముందుగా పార్టీ ప్రకటించింది. అయితే ఆయన 6 గంటలకు పిప్రికి చేరుకున్నారు. అక్కడినుంచి పాదయాత్రగా రాత్రి 8.30 గంటల వరకు ఇచ్చోడకు చేరుకున్నారు. కార్నర్ మీటింగ్ సుదీర్ఘంగా సాగింది. దీంట్లో నియోజకవర్గ నేతల నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల వరకు ప్రసంగించారు. చివరగా భట్టి ప్రసంగించారు.

ఎమ్మెల్యేపై కాంగ్రెస్ చార్జ్‌షీట్!

బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పాదయాత్రలో భాగంగా కాంగ్రెస్‌పై నిరసన తెలిపారు. ఆయనపై పార్టీ పరంగా చార్జ్‌షీట్ ఓపెన్ చేశారు. 'భట్టేబాజ్ బాపురావు' అంటూ ఆ చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. దళితబంధు ఇస్తానని మోసగించాడని, లబ్ధిదారుల నుంచి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు వసూలు చేస్తోన్నాడని ఆరోపించారు. బాపురావును తరిమికొడదామని, బోథ్ నియోజకవర్గాన్ని కాపాడుకుందామని చార్జ్‌షీట్‌లో పిలుపునిచ్చారు.

అంతా ప్రేమ్‌సాగర్‌రావే..

భట్టి విక్రమార్క పాదయాత్రను ఆదిలాబాద్ జిల్లా నుంచి తలపెట్టగా, ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు దీన్ని విజయవంతం చేసేందుకు శాయశక్తులా కృషి చేశారు. మొత్తంగా ఈ కార్యక్రమాన్ని తన భుజాన వేసుకొని నడిపించారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా ఈ పాదయాత్రలో పాల్గొంటారని మొదట భావించారు. అయితే నిర్మల్ జిల్లా వరకే తన పాదయాత్ర పరిమితం చేయడంతో ఆయన అలకబూనారని ప్రచారం జరుగుతోంది. దీంతో భట్టి యాత్రకు ఆయన దూరంగా ఉన్నారు. పిప్రికి వచ్చేటప్పుడు మార్గంమధ్యలో నిర్మల్‌లో ఆగిన భట్టి మహేశ్వర్‌రెడ్డిని కలిసి సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన దిగిరానట్టు తెలుస్తోంది. దీంతో పాదయాత్ర షెడ్యూల్ కంటే రెండు గంటలు ఆలస్యంగా మొదలైందనే ప్రచారం జరుగుతోంది. గురువారం రాత్రి ఇచ్చోడలోనే భట్టి బస చేశారు. శుక్రవారం ఇచ్చోడ నుంచి ఆయన పాదయాత్ర సిరికొండ వరకు సాగనుంది.

ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన నేతలు

భట్టి పాదయాత్రకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున నేతలు తరలివచ్చారు. దీంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం కనిపించింది. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత, బోథ్ నియోజకవర్గం నుంచి డాక్టర్ వన్నెల అశోక్, ఆడె గజానంద్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, సీనియర్ నాయకులు నరేశ్‌జాదవ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సురేఖ తదితరులున్నారు.

జూన్ నెలాఖరులోగా వైద్యకళాశాల పూర్తిచేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో కలిసి భవన నిర్మాణ పనులు పరిశీలన

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాబాపూర్ రహదారి మార్గంలో కొత్తగా నిర్మిస్తున్న వైద్యకళాశాల భవనం నిర్మాణ పనులు వేగవంతం చేసి, జూన్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి గురువారం నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.32 కోట్లతో చేపట్టిన వైద్యకళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ అనుమతి మేరకు ఈ విద్యాసంవత్సరం నుంచి ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించేలా ఇంజనీరింగ్ శాఖ అధికారులు రెండు షిఫ్టుల ద్వారా పనులు చేయించాలన్నారు. అలాగే వంద పడకల ఆసుపత్రి పనులు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని సందర్శించి వార్డులు, పరిసరాలను పరిశీలించారు. రోగులతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఆయన వెంట వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఆర్.నరసింహరావు, ఎస్.అంజయ్య, డీసీహెచ్ స్వామి తదితరులు ఉన్నారు.



వైద్య కళాశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఈవీఎంలకు పూర్తిస్థాయి భద్రత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోదాములో ఈవీఎంలకు పూర్తిస్థాయి భద్రత కల్పించినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని బ్యాలెటింగ్, కంట్రోలింగ్ యూనిట్లను అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గురువారం పంజాబ్ రాష్ట్ర ఎన్నికల అధికారులకు అప్పగించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని 277 బ్యాలెటింగ్ యూనిట్లు, 276 కంట్రోలింగ్ యూనిట్లను పంజాబ్ రాష్ట్ర ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. బందోబస్తు మధ్య యూనిట్లను తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వర్, తహసీల్దార్ రామ్మోహన్, ఎన్నికల డీటీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెకండియర్ పరీక్షలు ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 4,564 మంది హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 4,727 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,564 మంది హాజరయ్యారు. 163 మంది గైర్హాజరయ్యారు. 96శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జనరల్ విభాగంలో 4,027 మందికి 3,910 హాజరు కాగా 117 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 700 మందికి 654 మంది హాజరు కాగా 46 మంది పరీక్షలు రాయలేదు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, ప్రభుత్వం కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. డీఈఐవో శ్రీధర్ సుమన్ పరీక్షల తీరును పర్యవేక్షించారు. మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.



మోడల్ స్కూల్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాజేశం

అడవిలో అగ్గి వరుసలు

- శాటిలైట్ ద్వారా అగ్ని ప్రమాదాల సమాచారం
- ముందస్తుగా గ్రామాల్లో అవగాహన

జన్నారం: వేసవి కాలంలో అడవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు నూతన విధానాన్ని అవలంబిస్తున్నారు. ఈసారి కవ్వాల్ టైగర్‌జోన్‌లోని అన్ని అటవీ డివిజన్లలో ఆచరిస్తున్నారు. వేసవిలో అడవిలో అగ్ని ప్రమాదాలు పొంచి ఉంటాయి. అడవి కాలి వన్యప్రాణులు, చెట్లు, పక్షులకు ప్రాణహాని పొంచి ఉంటుంది. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించి అడవికి నిప్పు తగలకుండా ఆపేందుకు అడవిలో కూలీల ద్వారా ఫైర్‌లైన్స్(అగ్గి వరుసలు) ఏర్పాటు చేసి వాటికి నిప్పు పెడితే అడవంతా రగిలే అవకాశం ఉండదనే ఉద్దేశంతో అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వేసవిలో అడవిలో నిప్పు తగులకుండా మంచి ఫలితాలు ఇస్తున్నాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, జన్నారం అటవీ డివిజన్లలోని అన్నీ అటవీ బీట్‌లలో ఫైర్‌లైన్ పనులు చేయిస్తున్నారు. జిల్లాలోని ఫైర్‌లైన్స్ కోసం కాంపా స్కీం కింద నిధులు కేటాయించి సిబ్బందితో ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా అగ్గి పడిందని సమాచారం అందగానే సంబంధిత అధికారులు పరుగులు తీయాల్సి ఉంటుంది. బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు ఆ స్థలానికి వెళ్లి బ్లోయర్‌లతో మంటలు వ్యాపించకుండా ఆకులను తొలగించి ప్రమాదాలు నివారిస్తున్నారు. అగ్గి వరుసలతో జిల్లాలోని కోర్ ఏరియాలో ఈ ఏడాది ప్రమాదాలు తగ్గగా.. బఫర్ ఏరియాలో కూడా చాలా వరకు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.



అగ్గి వరుసలు తయారు చేస్తున్న కూలీలు

శాటిలైట్ ద్వారా అప్రమత్తం

అటవీ శాఖ ఉన్నతాధికారులు అగ్ని ప్రమాదాల నివారణకు టైగర్ కన్జర్వేషన్ అఫ్ అథారిటీ ఎస్ఎస్‌పీపీ అనే శాటిలైట్ ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ ఆధ్వర్యంలో శాటిలైట్ ద్వారా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా సమాచారం చేరవేస్తారు. ప్రతీ రోజు 24గంటలు ఏ చోట అగ్ని ప్రమాదం జరిగిన, జరుగుతున్న ప్రదేశంపై సంబంధిత అధికారులకు మొబైల్ ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది. కంపార్టుమెంటు నంబరుతో సహా తెలియజేస్తారు. దీంతో సంబంధిత అధికారులు జీపీఎస్ ద్వారా ఆ ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పేస్తారు. అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలనూ గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తారు. డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి మొబైల్‌ఫోన్‌కు, రేంజ్ అధికారికి తన రేంజ్ పరిధిలోని బీట్‌లలో, బీట్ అధికారికి తన బీట్ పరిధిలో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశం మెస్సేజ్‌లు వెళ్తాయి. దీంతో అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు

అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలు, నష్టంపై అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పశువుల కాపరులు అగ్గిపెట్టెలు, సిగరెట్, బీడీలు అడవిలోకి తీసుకెళ్లకుండా చూస్తున్నారు. పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం, చెత్త అడవిలో వేసి కాల్చడం చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు.

టైగర్ రిజర్వ్‌పై ప్రత్యేక శ్రద్ధ

కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం డివిజన్‌లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అడవుల్లో పర్యటించడం, అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలిస్తే సిబ్బంది వెంటనే అగ్నిమాపక కిట్లతో వెళ్లి ఆర్పడం చేస్తున్నారు. ఇటీవల డివిజన్‌లోని బఫర్ ఏరియాలో అగ్ని ప్రమాదం జరుగుతున్నట్లు రాత్రి 11 గంటలకు శాటిలైట్ సమాచారం ఇవ్వడంతోసంబంధిత బీట్ అధికారిని అప్రమత్తం చేశారు. రాత్రి ఒంటిగంట వరకుమంటలు ఆర్పేశారు. గత ఏడాది మార్చి వరకు 180చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగగా, ఈ ఏడాది ఇప్పటివరకు 72చోట్ల ఫైర్‌పాయింట్లు చూపుతూ మెస్సేజ్‌లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గత మూడేళ్ల క్రితంతో పరిశీలిస్తే ఇప్పుడు అడవుల్లో అగ్ని ప్రమాదాలు చాలావరకు తగ్గుముఖం పట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 10 వరకు 1400 వరకు ఫైర్ పాయింట్లు రాగా, ఖానాపూర్ డివిజన్‌లో 600, జన్నారం డివిజన్‌లో 72, ఆసిఫాబాద్ డివిజన్‌లో 380, ఉట్నూర్ డివిజన్‌లో 350 వరకు ఫైర్‌పాయింట్ల మెస్సేజ్‌లు వచ్చినట్లు తెలిపారు.



మంటల నుంచి ఆకులను దూరం చేస్తున్న సిబ్బంది

ఫైర్‌లైన్స్ అంటే..

అడవిలో ప్రస్తుతం ఆకులు రాలిపోతాయి. పశువుల కాపరులు, అడవికి వెళ్లిన వారు గానీ బీడీ, చుట్ట తాగి పడేస్తే ఎండిన ఆకులకు అంటుకుని అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. మంటలు అడవంతా వ్యాపించి పక్షులు, చెట్లు, వన్యప్రాణులకు హాని కలిగే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రతీ బీట్‌లోని అటవీ ప్రాంతంలో ఎడ్లబండ్ల తొవ్వలు, కాలినడక తొవ్వలకు ఇరువైపులా ఎండిన ఆకులను ఎయిర్‌బ్లోయర్లతో ఐదు మీటర్ల వెడల్పులో పోగు చేస్తారు. దారులు నున్నగా చేసి పోగు చేసిన ఆకులకు నిప్పంటించి కాల్చేస్తారు. పూర్తిగా కాలిపోయే వరకు పర్యవేక్షిస్తారు. ఫలితంగా ఎవరైనా బీడీ కోసం నిప్పంటించుకుని అగ్గిపుల్ల పడేసినా నిప్పంటుకునే అవకాశం ఉండదు. ఎప్పటికప్పుడు దారులపై ఎండిన ఆకులు ఉండకుండా చూస్తారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నా ఈ దారుల వరకే వ్యాపించి ఆగుతుంది. అన్ని డివిజన్లలోని కంపార్ట్‌మెంట్, బీట్, డివిజన్, బౌండరీలలో ఈ అగ్గి వరుసలు వేస్తారు. ఈ ఏడాది కూడా జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూరు, జన్నారం, మంచిర్యాల అటవీ డివిజన్లలో అడవుల్లో ఫైర్‌లైన్‌లు ఏర్పాటు చేసి ఆకులను కాల్చుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో 40 అటవీ బీట్‌లలో సుమారుగా 495 కిలోమీటర్ల దూరంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం



వేసవి వచ్చిందంటే అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసి సమాచారం అందిన వెంటనే సిబ్బందిని అక్కడికి పంపిస్తున్నాం. ఒక్కోసారి రాత్రి కూడా సిబ్బంది బ్లోయర్లతో అగ్గి రాజుకోకుండా ఆకులను దూరం చేసి ఫైర్‌లైన్‌లు చేస్తున్నారు. కోర్ ఏరియాలో ఈ సంవత్సరం ప్రమాదాలు లేవు.

– మాధవరావు, ఎఫ్‌డీవో, జన్నారం

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి ఒకరి మృతి


ఆత్రం భీము మృతదేహం

తిర్యాణి: ప్రమాదవశాత్తు చెలిమల (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుకు చెందిన కెనాల్‌లో పడి ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని చింతపెల్లి గ్రామపంచాయతీ పరిధి కొలంగూడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం కొలంగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీము(58) గ్రామ శివారులోని జొన్న చేనుకు ప్రతీరోజు కాపలాగా వెళ్లేవాడు. అదే క్రమంలో గురువారం వెళ్లి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయాడు. అటు వైపు వెళ్లిన రమేశ్ అనే వ్యక్తి భీము కాలువలో పడి ఉన్నాడని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి చూడగా భీము అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


హన్మయ్యకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చింతలమానెపల్లి నుంచి గూడెం వైపు వెళ్తున్న ఆటో నడుచుకుంటూ వెళ్తున్న చౌదరి హన్మయ్యను ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా హన్మయ్యకు ముఖం, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా చేరుకున్న ఈఎంటీ ఎర్ర అజయ్ కుమార్, పైలట్ సలీమ్‌లు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఇటిక్యాల గ్రామ స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఇటిక్యాల నుంచి తిమ్మాపూర్ వైపు యువకులు బైక్‌పై వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌కు కాలు విరిగింది. శ్రీనివాస్ తలకు, ముఖంపై గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు జరుపుతున్నారు.

సుఖ వ్యాధులపై అప్రమత్తత అవసరం

దండేపల్లి: సుఖ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, చైల్డ్‌ఫర్ ఇండియా –లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా కోఆర్డినేటర్ సరిత అన్నారు. దండేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద చైల్డ్‌ఫర్ ఇండియా –లింక్‌వర్క్ స్కీం ఆధ్వర్యంలో సుఖ వ్యాధులు, వాటి నివారణ, ప్రమాదకర పరివర్తనల తగ్గింపుపై గురువారం అవగాహన కల్పించారు. సుఖ వ్యాధుల బారిన పడ్డ వారికి ప్రభుత్వం అందించే సేవలను వివరించారు. సర్పంచ్ చంద్రకళ, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమన్న, లింక్ వర్కర్స్ విజయలలిత, శ్రీకాంత్, సాగర్ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యకు సింగరేణి నో

- ఏఈ పోస్టులకు తిరస్కరణ
- జేఎన్టీయూ డిస్టెన్స్ బీటెక్ కోర్సుకు గుర్తింపు కరువు
- పదోన్నతులకు దూరమవుతున్న ఫోర్‌మెన్‌లు
- పట్టించుకోని కార్మిక సంఘాలు


టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఫోర్‌మెన్లు(ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో దూరవిద్య కోర్సు సర్టిఫికెట్లకు గుర్తింపు కరువైంది. కంపెనీ కార్మికుల పదోన్నతులు, రిక్రూట్‌మెంటులో జేఎన్టీయూ డిస్టెన్స్ బీటెక్ కోర్సును తిరస్కరిస్తోంది. సింగరేణిలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్, ఫిట్టర్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న ఈఅండ్‌ఎం ఉద్యోగులకు ఏఈ పదోన్నతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా ఇంటర్నల్ పరీక్ష నిర్వహిస్తారు. రెగ్యులర్ బీటెక్ చేస్తేనే అనుమతి ఇస్తుంది. దూరవిద్యను నిరాకరిస్తున్నారు. జేఎన్టీయూలో డిస్టెన్స్ బీటెక్ కోర్సు సర్టిఫికెట్‌నూ పట్టించుకోవడం లేదు. ఇందులో డిస్టెన్స్ డిగ్రీ కోర్సు చేసిన వారు కంపెనీ వ్యాప్తంగా సుమారు 100 మందికి పైగా ఉన్నారు. ఇటీవల కంపెనీలో 24ఏఈ పోస్టుల భర్తీకి ఇంటర్నల్ నోటిఫికేషన్ ఇచ్చారు. కంపెనీ నిబంధన వల్ల తాము నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఏఈ పోస్టుల భర్తీకి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో కూడా రెగ్యులర్ ఉంటేనే పరీక్షకు అర్హతగా పేర్కొంటోంది. డిస్టెన్స్ డిగ్రీని తిరస్కరిస్తుంది. జేఎన్టీయూ దూరవిద్య(కరస్పాండెంట్ కం కాంట్రాక్టు, సీసీసీ) ద్వారా మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ బ్రాంచిలో ప్రతీ ఏడాది నెల రోజులపాటు తరగతులు, ప్రాక్టికల్స్ ఉంటాయి.

క్లర్క్ పోస్టులకు ఓకే.. ఏఈకి అభ్యంతరం

ఇటీవల కంపెనీ ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ ద్వారా జూనియర్ అసిస్టెంట్(క్లర్క్) పోస్టులు భర్తీ చేసింది. డిస్టెన్స్ బీటెక్ వారికీ అవకాశం కల్పించారు. ఈ విషయమై అభ్యర్థులు ప్రశ్నిస్తే క్లర్క్ పని సామర్థ్యానికి డిస్టెన్స్ బీటెక్ సరిపోతుందని, కానీ గనుల్లో ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి కోర్ గ్రూపుల్లో రెగ్యులర్ బీటెక్ చేసిన వారే సమర్థంగా చేయగలరని, డిస్టెన్స్‌లో చేసిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్, సబ్జెక్టుపై అంత పట్టు ఉండదని అధికారులు వాదిస్తున్నారు.

తనిఖీ అధికారికే డిస్టెన్స్ డిగ్రీ..

గనుల్లో బొగ్గు ఉత్పత్తి, సేఫ్టీ అంతా కూడా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీజీఎంఎస్) అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ అధికారుల ఆదేశాల మేరకు నడుచుకోవాలి. మైనింగ్‌లో ఏ పని చేయాలన్నా వారి అనుమతి, తనిఖీలు తప్పనిసరి. ఇలాంటి డీజీఎంఎస్ విభాగంలో నాగుల్‌మీరా అనే ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ (డీఎంఎస్)గా పని చేస్తున్నారు. ఆయన కూడా జేఎన్టీయూలో డిస్టెన్స్ బీటెక్ చేసి యూపీఎస్సీ ద్వారా ఈ ఉద్యోగం సాధించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన యూపీఎస్సీని కూడా ఈ డిస్టెన్స్ డిగ్రీని గుర్తించింది. గనుల్లో తనిఖీ చేసే అధికారి ఉద్యోగానికి డిస్టెన్స్ డిగ్రీ పని చేసినప్పుడు అదే స్వభావం గల సింగరేణిలో కింది స్థాయి పోస్టుకు ఎందుకు పనికిరాదో ఉన్నత అధికారులే చెప్పాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. తమను పరీక్షకు అనుమతిస్తే సామర్థ్యం ఏంటో తెలుస్తుందని, పదోన్నతుల కోసం నిర్వహించే పరీక్షలకు అనుమతించకపోతే ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై కార్మిక సంఘాల నాయకులు పట్టించుకోకపోవడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. కంపెనీలో ఉన్న పాలసీ లోపాల వల్ల ఈ సమస్య జటిలంగా మారింది. ఉన్నత అధికారులతో మాట్లాడి తమకు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏఎంఐఈకి ఏ మాత్రం తీసిపోదు..

అసోసియేట్ మెంబర్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ ఇంజినీర్(ఏఎంఐఈ)లో డిస్టెన్స్‌లో బీఈ చేసిన వారిని కూడా కంపెనీ ఏఈ ఇంటర్నల్ పదోన్నతులు, కొత్త రిక్రూట్‌మెంటుకు అనుమతిస్తుందని, కానీ దీనికి ఏమాత్రం తీసిపోని జేఎన్టీయూ డిస్టెన్స్ బీటెక్ కోర్సుకు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఏఎంఐఈలో తరగతులు కూడా ఉండవని, రిఫరల్ బుక్స్ మాత్రమే చదివి పరీక్షలకు హాజరవుతారని వారితో పోల్చితే తామే ఉత్తమని పేర్కొంటున్నారు.

క్లాసులు విన్నాం.. ప్రాక్టికల్స్ చేశాం..

డిస్టెన్స్ బీటెక్‌లో కూడా తాము కాలేజీల్లో నిర్ణీత రోజులపాటు క్లాసు విన్నాం. ప్రాక్టికల్ కూడా చేశాం. ప్రాక్టికల్స్‌లో 232 క్రెడిట్స్ ఉంటేనే ఫైనల్ పరీక్షకు అనుమతిస్తారు. ఇంతటి సామర్థ్యంతో తాము బీటెక్ కోర్సు చేస్తే దాన్ని ఏఈ పదోన్నతులకు పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయం. డిస్టెన్స్ సర్టిఫికెట్‌తోపాటు ఫీల్డ్ అనుభవం కూడా ఉంది. యాజమాన్యం స్పందించి నిబంధనలు మార్చి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– ఓ ఫోర్‌మెన్ అభ్యర్థి

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పాతమంచిర్యాల: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్ పాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐఎఫ్‌టీయూ మహాసభలకు కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి తోకల తిరుపతి, కోశాధికారి కిష్టన్న, నాయకులు శివ, నాగరాజు, అప్పరాజు, శంకర్, శోభ, కృష్ణవేణి, లక్ష్మి పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చీటీలు అందించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగులకు గత సంవత్సరానికి సంబంధించిన సీఎంపీఎఫ్ చీటీలను వెంటనే అందించాలని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు గురువారం యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు డి.అన్నయ్య, మంద మల్లారెడ్డి, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డిలు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావును కలిసి కోరారు.

రెండు ఓట్ల విధానం అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో రెండు ఓట్ల విధానం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజారెడ్డి అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఒక్క ఓటు విధానం వల్ల డివిజన్ స్థాయిలో ప్రాతినిధ్య సంఘంగా, కంపెనీ స్థాయిలో గుర్తింపు సంఘంగా కొనసాగే విధానం ఉందన్నారు. దీనిపై కోర్టుకు సైతం వెళ్లినట్లు పేర్కొన్నారు. గతంలో కార్మిక సంఘాలు లేబర్ కమిషనర్ వద్ద చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన ఉత్తర్వులను కంపెనీ విడుదల చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కస్తూరి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్, బానేశ్, అజయ్, నరేశ్, గౌస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులపై నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న జనరల్ సెక్రెటరీ సంజయ్‌కుమార్

మందమర్రిరూరల్: సింగరేణికి లాభాలు కురిపిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీఎస్‌యూసీ జనరల్ సెక్రెటరీ సంజయ్‌కుమార్ ఆరోపించారు. గురువారం మందమర్రి ఏరియాలోని సివిల్ ఆఫీస్ ఆవరణలో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు వారికి లాభాల్లో వాటా ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఆయన వెంట సమ్మయ్య, సంపత్, లక్ష్మీరాజం, రాజు, సురేందర్, సురేష్, కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- సీపీ రేమా రాజేశ్వరి


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సీపీ రేమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: నేరాలు అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని రామగుండం సీపీ రేమా రాజేశ్వరి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా సెక్టర్ –1 పరిధిలో రాజీవ్‌నగర్, హమాలివాడ, తిలక్‌నగర్, గోపాల్‌వాడ ప్రాంతంలో రూ. 2లక్షల 65వేలతో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన ఎస్సై రాజేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డీసీపీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించారు. స్థానిక డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీలు తిరుపతిరెడ్డి, నరేందర్, సీఐలు పాల్గొన్నారు.

పొట్టదశలో జాగ్రత్తలు పాటించాలి

- తెగుళ్లు సోకే అవకాశం
- దిగుబడిపై ప్రభావం
- చెన్నూర్ ఏవో కవిత


పొట్టదశకు చేరుకున్న వరి పంట


కవిత, ఏవో, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: వరి పంటలో పొట్టదశ చాలా కీలకమైనది. యాసంగిలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 98,521 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. చెన్నూర్ మండలంలో 13వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. ప్రస్తుతం వరి పంట పొట్టదశకు చేరుకుంటున్న తరుణంలో రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని, లేదంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని చెన్నూర్ ఏవో కవిత చెబుతున్నారు. ఈ సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

- వరిలో పొట్టదశలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగులు ఆశిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. ఈ పురుగులు సోకినట్లు గుర్తిస్తే నత్రజని ఎరువుల వాడకం పూర్తిగా నిలిపి వేయాలి. తెగులు సోకిన పొలం నుంచి ఇతర పొలానికి నీరు వెళ్లకుండా జాగ్రత్త పడాలి. 2 –3 రోజులు పాటు పొలం ఆరబెట్టాలి. ఎకరానికి 20 కిలోల మ్యూరేట్ పొటాష్ చల్లాలి.
- 500 గ్రాముల సూడోమోనాస్ ఫ్లోరో సెన్స్ శిలీంద్రాన్ని 100లీటర్ల నీటికి కలిపి ఎకరానికి సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేస్తే కొన్ని రకాల పాడ తెగుళ్లు, అగ్గి తెగులు, పొట్టకుళ్లు తెగులు అరికట్టవచ్చు.
- కాండం కుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి వాలిడామైసిన్ 2 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి.
- ఈ దశలో సూటి ఎరువులు వాడకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.
- చిరు పొట్టదశలో కాంప్లెక్స్ ఎరువులు వేయకూడదు. సుడిదోమ ఆశించే అవకాశం ఉంటుంది. దుబ్బుకు 20కి మించి సుడిదోమలు ఉంటే నివారణ చర్యలు తీసుకోవాలి. పంట చేలో ఉన్న నీటిని బయటకు తీసి ఎకరానికి ఫెనుబ్యూకార్బ్ 400 మి.లీ, 200 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణం వరి దుబ్బు మొదళ్లలో పడేలా పిచికారీ చేయాలి.
- వరిలో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ వంటి విషపు ఎర లేదా బుట్టలు, పొగ యంత్రాల ద్వారా ఎలుకల కన్నాల్లోకి పొగ బారించాలి.

ఎస్‌ఎంపీ అమలు చేయాలి

శ్రీరాంపూర్: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ (ఎస్‌ఎంపీ)అమలు చేయాలని ఆర్కే 5, 6 గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి తెలిపారు. గురువారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన సేఫ్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరిగినా, ప్రమాదానికి ఆస్కారం ఉన్నా నివారణ చర్యలు ఎలా తీసుకోవాలో వివరించారు. ప్రతీ ఉద్యోగి వ్యక్తిగత సేఫ్టీతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్, గని సంక్షేమ అధికారి రణదీప్, అసిస్టెంట్ మేనేజర్లు రాందాస్, రాంచందర్, వీరన్న, సందీప్, పిట్ సెక్రెటరీలు మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సర్పంచ్.. వినూత్న నిరసన


ధాన్యం బస్తాలు మోస్తున్న సర్పంచ్ సోమయ్య

కౌటాల(సిర్పూర్): గ్రామాభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు రాక, సక్రమంగా గౌరవ వేతనం అందక సర్పంచులు పడుతున్న ఇబ్బందులను తెలియజేసేందుకు గురువారం మండలంలోని తాటినగర్ గ్రామ సర్పంచ్ రత్నం సోమయ్య వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గ్రామంలో వడ్ల కొనుగోలుకు వచ్చిన వ్యాపారి వద్ద హమాలీగా మారి బస్తాలు మోశారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లకు ప్రభుత్వం సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం లేదని విమర్శించారు.

పకడ్బందీగా విచారణ చేపట్టాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- నెలవారీ నేర సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: దర్యాప్తులో ఉన్న కేసుల్లో పకడ్బందీగా విచారణ చేపట్టి నేరస్తులకు చట్టపరంగా శిక్షపడేలా చూడాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల విచారణకు అధికారులు సాంకేతిక పరిజ్ఞానం విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులను సంప్రదించి పటిష్ట చర్యలు అమలు చేయాలన్నారు. కేసుల విచారణలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, విచారణ, స్టేట్‌మెంట్ రికార్డు, సీడీఎఫ్ ఫిల్ చేయడం, ఫొటోలు, ప్రాపర్టీ సీజ్, నిందితుల వివరాల ఎంట్రీ, చార్జ్‌షీట్ ఫైల్ తదితర అంశాలపై ఎస్‌హెచ్‌వోలకు సూచనలిచ్చారు. బెట్టింగ్, మట్కా, గంజాయి లాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన సమావేశంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో జిల్లా పోలీసుల తీరుపై డీజీపీ అంజనీకుమార్ అభినందించారని తెలిపారు. అంతకు ముందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాల తెలుసుకున్నారు. అదనపు ఎస్పీలు అచ్చేశ్వర్‌రావు, భీమ్‌రావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

రంగు దుస్తుల్లో ఎమ్మెల్యేలు


రంగుల దుస్తుల్లో ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు

కాగజ్‌నగర్‌రూరల్: నిత్యం తెల్లని ఖద్దర్ చొక్కాలు ధరించి కనిపించే ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కులు గురువారం రంగు దుస్తులు ధరించారు. తన 30ఏళ్ల రాజకీయ చరిత్రలో నిత్యం తెల్ల చొక్కా, తెల్ల ప్యాంటు మాత్రమే ధరించానని ఎమ్మెల్యే కోనప్ప తెలిపారు. కలర్ టీషర్టును తన కూతురు ప్రతిమ అమెరికా నుంచి బహుమతిగా తీసుకురాగా ధరించినట్లు పేర్కొన్నారు. కాగా పట్టణంలోని కోనేరు నిత్యాన్నదాన సత్రాన్ని గురువారం సందర్శించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కూడా రంగు చొక్కా ధరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలుర పాఠశాలలో డీటీడీవో మణెమ్మతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వందశాతం ఉత్తీర్ణత కోసం రూపొందించిన ప్రత్యేక కార్యాచరణను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఆదేశించారు. గతేడాది తక్కువ ఉత్తీర్ణత నమోదైన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం డీటీడీవో మాట్లాడుతూ జిల్లాలో 37 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 1243 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని తెలిపారు. మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, పురుషోత్తం, జీసీడీవో శకుంతల, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి


రెబ్బెన: నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): సంస్థలో పని చేసే ప్రతీ ఉద్యోగి విధులపై నిబద్ధత కలిగి ఉండి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గురువారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ ఆవరణలో 11మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. డీజీఎంఎస్ (మెడికల్) డాక్టర్ జార్జ్‌జాన్, ఎస్‌వోటూజీఎం గుప్తా, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్, ఎస్టేట్స్ అధికారిణి నవనీత, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, డీవైసీఎంవో ఆర్ శౌరీ, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

మందమర్రిరూరల్: ఏరియాలో మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల వారసులు 20 మందికి గురువారం జీఎం కార్యాలయం ఆవరణలో ఏరియా జీఎం కారుణ్య నియామక పత్రాలు అందించారు. జీఎం మాట్లాడుతూ ఉద్యోగం పొందిన వారు క్రమం తప్పకుండా విధులకు హాజరై సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు ఉన్నారు.

సీపీఆర్, ఏఈడీలపై అవగాహన పెంచుకోవాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి


సీపీఆర్ చేస్తున్న మంత్రి ఐకే రెడ్డి, పక్కన ఎమ్మెల్యే, కలెక్టర్, వైద్యాధికారులు

బెల్లంపల్లి: ఆకస్మిక గుండెపోటు నుంచి మనుషుల ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్, ఏఈడీలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీడీ, ఏఈడీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆకస్మిక గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేయడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గుండెపోటు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 27సీపీఆర్, ఏఈడీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ గుండెపోటు మరణాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుబ్బారాయుడు, వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ అరవింద్, ఆర్డీవో శ్యామలాదేవి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్‌చైర్మన్ సుదర్శన్, ఎంపీపీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీడీవోగా శ్రీనివాస్



రెబ్బెన: రెబ్బెన ఎంపీడీవోగా శుక్రవారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతకు ముందు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన సత్యనారాయణ సింగ్‌ను తిర్యాణి మండలానికి బదిలీ చేయగా, పెంచికల్‌పేట్ నుంచి శ్రీనివాస్‌ను రెబ్బెనకు బదిలీ అయ్యారు. కాగా శ్రీనివాస్ గతంలో రెబ్బెన ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. మండలంపై పూర్తిస్థాయి పట్టు ఉండటం, స్థానికులకు సుపరిచితమైన అధికారి ఎంపీడీవోగా రానుండడంతో మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

18న ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం 10 గంటలకు మండల అభివృద్ధి, సమస్యలు–పరిష్కారాలు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ 21వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటలకు దీపారాధన, ప్రత్యేక పూజలు, చండీయాగం, పూర్ణాహుతి, మహా హారతి కార్యక్రమాలు చేపడుతామన్నారు. సాయంత్రం పడిపూజ, భజన, హారతి, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని గుడ్లబోరిలో శుక్రవారం నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అజయ్, జగన్నాథ్, దిగంబర్ గురువారం తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ. 25 వేలు, రన్నరప్‌కు రూ. 12 వేలు అందిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ. 1100 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు సామూహిక వివాహాలు

కౌటాల: మండలంలోని తలోడి భీమదేవర ఆలయంలో శుక్రవారం సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డబ్బా బాపు, గోపాల్ గురువారం తెలిపారు. ఆదివాసీ కొలావార్ కులానికి చెందిన ఐదు నిరుపేద జంటలకు సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో వివాహాలు జరపుతునున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు, కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జవెల్లి పాఠశాలలో గురువారం ఎంపీటీసీ చౌదరి కల్పన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల మొహిసిన్, రంగన్న, ఉపాధ్యాయులు రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

తిర్యాణి: అన్ని రంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘం మండల అధ్యక్షుడు నల్లూరి జగదీశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా వీరిని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.

ఆటపాటలు నేర్పించాలి



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలు నేర్పించాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ అన్నారు. కెరమెరి మండలం పెద్ద సాకడలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. పిల్లలతో గోడలపై ఉన్న అక్షరాలను చదివించాలని సూచించారు. ఆటపాటలతో బోధన చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తదితరులు ఉన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీవోఏలు, నాయకులు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆసిఫాబాద్: వీవోఏల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మూడు రోజుల టోకెన్ సమ్మెను మహిళా సంఘాల సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16, 17న మండల కేంద్రాల్లో, 18న కలెక్టరేట్ ఎదుట జిల్లావ్యాప్త ధర్నాలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపడుతున్నామని తెలిపారు. సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదనపు పనులు ఆపాలని, శారీరకంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు వేములవాడ రమేశ్, ఉపాధ్యక్షులు గందె సునీత, కీర్తిరామ, కాట్కర్ కల్పన, ఫైమా, సుదర్శన్, శంకర్, సుధీర్, గణేశ్, జ్యోతి, కవిత, శ్రీలక్ష్మి, పద్మ, జయ, లక్ష్మి, అమృత, జయ, సురేఖ, అర్చన, శారద పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట గురువారం వీఓఏలు ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు రవిదాస్, వీఓఏలు ఆనంద్‌రావు, బిక్కుబాయి, చంద్రకాంత్, గోవర్దన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యల పరిష్కారానికి పోరాటం

కాగజ్‌నగర్‌రూరల్: ఐకేపీ వీఓఏల సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐకేపీ ఏపీఎం ముక్తేశ్వర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సిరిశెట్టి శ్రీనివాస్, నాయకులు ధన్‌రాజ్, అంకయ్య, పురుషోత్తం, పత్రయ్య, పొన్న గీత, వనిత, సర్దార్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

చింతలమానెపల్లి: ఐకేపీ ఉద్యోగులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని ఐకేపీ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు తోరె నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండల ఐకేపీ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మార్చి 16, 17, 18 తేదీల్లో టోకెన్ సమ్మె చేస్తున్నామని తెలుపుతూ సమ్మె నోటీసు అందజేశామని తెలిపారు.

కౌటాల: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ సంఘం జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట గురువారం మండలంలోని టోకెన్ సమ్మె చేశారు. ఏపీఎం వెంకట రమణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకటేశ్, ఎల్ములే దత్తు, రవి, మహేశ్వరి, ప్రతిభ, ఇందు పాల్గొన్నారు.

బెజ్జూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16, 17, 18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏపీఎం భద్రయ్య, అధ్యక్షురాలు శ్రీదేవిలకు వినతిపత్రం అందజేశారు. విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పెద్దల సంతోశ్, ఉపాధ్యక్షుడు గోరంట్ల విజయ్, ముంజం కిషన్, పొట్ట విలాస్, కొడుప పార్వతి, శంకరి, కొరితే జయ సుధ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



దహెగాం: పల్లెలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. దహెగాం నుంచి కాగజ్‌నగర్ వైపు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో బొలెరో వాహనంలో కిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు చర్చించుకుంటున్నారు.

అలరించిన 'ఫేర్‌వెల్'



కెరమెరి: మండల కేంద్రంలోని గోయగాం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీ అలరించింది. తొమ్మిదో తరగతి విద్యార్థులు 'పది' విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం నల్లగొండ రమేశ్, ఉపాధ్యాయులు విజేశ్, గణేశ్, మురళి, ప్రవీణ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పరీక్ష లీకేజీపై నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తోపాటు కార్యదర్శిని సస్పెండ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉషాన్ నవీన్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పాలిట కేసీఆర్ ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను పట్టించుకోవడంలో విఫలమైందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శి రాజీనామా చేయాలని, లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి యశ్వంత్, శ్రావణ్, శేఖర్, కార్తీక్, దీక్షిత, దర్శణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

చింతలమానెపల్లి: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సమతాసైనిక్ దళ్ జిల్లా ఇన్‌చార్జి జాడి దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నాపత్రం లీకేజీ వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. పరీక్ష నిర్వహణలో అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలోని సివిల్ సప్లై హమాలీ కార్మికుడు అఫ్రోజ్‌పై దాడిచేసిన స్టేజీ– 2 కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎంఎల్ఎస్ గోదాం ఇన్‌చార్జి మధుకర్‌ను సస్పెండ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్మికుడిపై దాడికి నిరసనగా గురువారం జిల్లావ్యాప్తంగా హమాలీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపేందర్ మాట్లాడుతూ అఫ్రోజ్‌పై దాడి చేసి రెండు రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు ముదాజీ, కిషన్, సురేశ్, సుధాకర్, నారాయణ, శంకర్, దయాకర్, రాజు, ధర్మాజీ తదితరులు పాల్గొన్నారు.

అడవులకు నిప్పంటిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

బెజ్జూర్: అడవులకు నిప్పు అంటిస్తే చర్యలు తప్పవని ఎఫ్‌బీవో వెంకటేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని చిన్నసిద్దాపూర్‌లో అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సమీప ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు అడవుల సంరక్షణకు సహకరించాలని కోరారు. అడవుల్లో నిప్పు పెట్టకుండా చూడాలన్నారు. అడవులతోనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, వాతావరణం సమతుల్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.శ్రీనివాస్, రైతులు నికూరి నగేశ్, భీంరావు, రమేశ్, శంకర్, మహేశ్, విలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతివనం మొక్కలు దగ్ధం



కాలిపోయిన మొక్కలు

కౌటాల: మండలంలోని నాగేపల్లి పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు దగ్ధమైనట్లు పంచాయతీ కార్యదర్శి సంధ్య గురువారం తెలిపారు. ప్రకృతి వనం సమీపంలోని రైతు తమ చేనులో పత్తి కట్టెలకు నిప్పు అంటించాడు. దీంతో గాలికి నిప్పు రవ్వలు ప్రకృతి వనంలో పడడంతో మొక్కలు కాలిపోయాయి. గ్రామానికి మూడు కిలో మీటర్ల దూరంలో ప్రకృతి వనం ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కట్ట మైసమ్మ విగ్రహం ఊరేగింపు



కోలాటం ఆడుతున్న మహిళలు, చిన్నారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో నూతన నిర్మించిన కట్టమైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం కట్ట మైసమ్మ విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. శ్రీలక్ష్మి నారాయణ దేవాలయం నుంచి మహిళల కోలాట నృత్యాల మధ్య ఊరేగించారు. కట్ట మైసమ్మ ఆలయంలో గోమాతపూజ, యజ్ఞశాల ప్రవేశం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కచ్చకాయల అంజన్న, కార్య నిర్వాహక అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

రెబ్బెన: మండలంలోని గోలేటిలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలనే త్యాగం మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మైలారపు సుగుణాకర్, నాయకులు యంసాని రాజీరు, జూలపల్లి ప్రకాశ్, సిద్దంశెట్టి ప్రకాశ్, పాత శ్రీనివాస్, మంచాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్

దహెగాం: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని గెర్రె గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. సకాలంలో చెల్లిస్తే మరిన్ని రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సాయం

సిర్పూర్(టి): పేదింటి ఆడపిల్ల పెళ్లికి యువశక్తి సేవా సమితి సభ్యులు అండగా నిలిచారు. మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బాలినె పరదేశి కుమార్తె వివాహం గురువారం జరిగింది. యువశక్తి సేవాసమితి సభ్యులు, రూ.50 వేలతో పాటు బియ్యం, కూరగాయలు అందజేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కోఆర్డినేటర్లు స్వర్ణ, సత్తయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ వసతి గృహాలను గురువారం సందర్శించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యతోపాటు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ అధికారి నలంద, వార్డెన్ శంకరమ్మ ఉన్నారు.

ఫ్యాన్లు వితరణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనానికి వాంకిడి ఎంపీపీ విమలాబాయి ప్రహ్లాద్ ముండే గురువారం పది ఫ్యాన్లు అందించారు. ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం, నాయకులు సంతోష్, రమేశ్, మారుతి, శంకర్, వెంకన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానెపల్లి: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. గురువారం మండలంలోని బాబాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే శిబిరం ద్వారా కంటి పరీక్ష నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డుబ్బుల వెంకన్న, చాప్లె సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి అన్నిమండలాల ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.30 కోట్లతో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు. మండలాల వారీగా ప్రారంభమైన పనుల వివరాలు తెలుసుకుని, వాటికి సంబంధించిన ఎంబీ రికార్డు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో సురేందర్, డీపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టిన మన ఊరు– మన బడి పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండలంలోని వంకులం ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులతోపాటు ఎలక్ట్రికల్, సంప్ పనులను పరిశీలించారు. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్ల వివరాలను తెలుసుకుని, ఈజీఎస్ పథకంలో మంజూరైన మరుగుదొడ్లు, ప్రహరీ పనులు ప్రారంభించాలని సర్పంచ్ జాదవ్ లలితకు సూచించారు. ఏడో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. తెలుగు ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తుండగా విద్యార్థులను తెలుగు పాఠ్యాంశాల్లోని పలు అంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. హెచ్‌ఎం జాడి ప్రభాకర్, నాయకులు జాదవ్ ప్రేందాస్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



దహెగాం: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రానికి పరుగు తీస్తున్న విద్యార్థిని

దహెగాం: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలో 152 మంది విద్యార్థులు ఉండగా.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. 152 మందికి 145 మంది హాజరైనట్లు సీఎస్ అమరేందర్ తెలిపారు.

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 222 మంది విద్యార్థులకు 205 మంది విద్యార్థులు హాజరయ్యారు. 17 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ స్వరూప, డీవో సునీత తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

వాంకిడి: మూఢ నమ్మకాలు, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోనాపూర్‌లో బుధవారం రాత్రి మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు, రోడ్డు ప్రమాదాలు, ఆన్‌లైన్ మోసాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.